వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
సోమవారం 18 మే 2026




## శిల్పారామంలో పాటలు అధరహో..

**కడప కార్పొరేషన్ మే17 ప్రభాతవార్త:**

కడప శిల్పారామంలో సాంస్కృతిక కళావేదిక మీద పద్మాకర్ సహకారంతో ఆదివారం కడప నగరానికి చెందిన వరల్డ్ డాన్స్ అకాడమీ బృందం వారు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అదరహో అనిపించాయి. జారిందామా జారిందామా, గోదావరి గట్టు మీద రామచిలకవే, పాలపిట్ట వంటి పాటలు అలవించాయి. ఈ కార్యక్రమంను శిల్పారామం ఇంచార్జ్ పరిపాలన అధికారి డి.వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.



## కుందూ నదిలో మట్టితోలకం విషయమై ఘర్షణ

**రాజుపాళెం, మే 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వెలవలి గ్రామంలో కుందూ నదిలో గల మట్టితోలక విషయమై ఆదివారం టిడిపి మండల కార్యదర్శి కల్లుట్ల మోలాలి పైన అదే గ్రామానికి చెందిన రసూల్, అతని ఇద్దరు కొడుకులు దాడి చేసి గాయపరిచారు. ఈ విషయమై ఏఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పోలీసుల కథనం మేరకు కుందూ నదిలో మట్టి, ఇసుక జెసిబిల సహాయంతో ట్రాక్టర్లతో తోలుకొనే విషయంలో మోలాలి కుటుంబమునకు రసూల్ కుటుంబం సభ్యుల మధ్యన ఘర్షణ జరిగినది. ఈ ఘర్షణలో మోలాలి పైన దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలై ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మోలాలి పై జరిగిన దాడి విషయమై వెలవలి గ్రా మానికి చెందిన కమ్ము సాబ్ గారి రసూల్, ఖాజావలి, మహబూబాషాలపైన కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు.

### గల్ఫ్ దేశాలపై ఆధారపడకుండా

# ఇక్కడే ఉద్యోగాలు

- ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం
- రాజంపేట జాబ్ మేళాలో జగన్మోహన్ రాజు



మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

**రాజంపేట, మే 17 ప్రభాతవార్త**

రాజంపేట ప్రాంత యువత గల్ఫ్ దేశాలపై ఆధారపడకుండా ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పించాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రత్యేక ఎకనమిక్ జోన్ ఏర్పాటు చేయాలని ఇటీవల ఒంటిమిట్ట పర్యటనకు వచ్చినప్పుడు ఆదేశించారని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఆదివారం రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు 1200 మందితరలి వచ్చారు.వివిధ కంపెనీలలో 400 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. రాజంపేట ప్రాంతం అంటేనే చదువుకున్న విద్యార్థులు అందరూ ఉద్యోగ అవకాశాలు లేకుండా గల్ఫ్ బాట పట్టి అక్కడ డ్రైవర్ల గాను,ఉద్యోగాలలో బాగా చదువుకున్న వారు కూడా పనిచేస్తున్నారని,అటువంటి రాజంపేటలో గల్ఫ్ కు వెళ్లే వారి సంఖ్య తగ్గించి చదువుకున్న వారికి ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అంతేకాకుండా ఇప్పటికే రాజంపేట ప్రాంతంలో పరిశ్రమలు రాబోతున్నాయని,వాటితో పాటు వివిధ కంపెనీలకు సంబంధించి జాబ్ మేళాలు నిర్వహించి ఈ జాబ్ మేళాలో అర్హత పొందిన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం తమకు చాలా ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. రాజంపేట నియోజకవర్గంలో వారంలో ఏడు రోజులు ప్రజల కోసమే పని చేస్తామని, ప్రజలకు అనారోగ్య సమస్యలు తొలగించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలతో పాటు,నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కంపెనీలతో జాబ్ మేళాలు వరుసగా నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ప్రతి ఇంట్లో ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఉండాలన్న ముఖ్యమంత్రి లక్ష్యంగా త్వరలోనే వారికోసం కూడా ప్రత్యేక మేళా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జాబ్ మేళాకు వచ్చిన ప్రతి ఒక్కరికిభోజన వసతితోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించిన రాజంపేట టీడీపీ ఇన్చార్జ్ కి పలువురు నిరుద్యోగులు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ నవీన్, మేడికొండ రవికుమార్, ఒంటిమిట్ట జెడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పరశురామ్, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జాబ్ మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు



ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధి

## ప్లాస్టిక్ నిర్మూలనకు ముందడుగు

- మైదానం శుభ్రపరిచి 20 బస్తాల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ
- మున్సిపల్ వాహనానికి అప్పగింత



మైదానంలో తూగుట్ల మధు ఆధ్వర్యంలో చెత్తను సేకరిస్తున్న సన్రైజ్ యోగా గ్రూప్ సభ్యులు

**పులివెందుల, మే 17 , ప్రభాతవార్త :**

ఈరోజు ప్లాస్టిక్‌ను దూరం చేయకపోతే... రేపు ఆరోగ్యకరమైన జీవితం దూరమవుతుంది" అనే సందేశంతో పులివెందులలో సన్‌రైజ్ యోగా గ్రూప్ సభ్యులు ఆదివారం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు స్థానిక మైదానాన్ని శుభ్రపరిచి, అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా సుమారు 20 బస్తాల ప్లాస్టిక్ చెత్తను సేకరించి మున్సిపల్ వాహనానికి అప్పగించారు.యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగ పడాలని సన్‌రైజ్ యోగా గ్రూప్ సభ్యులు సంకల్పిం చారని నిర్వాహకులు తెలిపారు. యువత సామాజిక బాధ్యతను గుర్తించి ఇలాంటి కార్యక్రమా ల్లో పాల్గొనడం అభినంద నీయమని స్థానికులు పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రమైన పులివెందుల నిర్మాణానికి అందరూ సహకరించాలని తూగుట్ల మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సన్‌రైజ్ యోగా గ్రూప్ సభ్యులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు పెద్దపీట వేసిన ఘనత జగన్‌కే దక్కింది

### మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్



**ప్రొద్దుటూరు మే 17 ప్రభాతవార్త**

నియోజకవర్గ అభివృద్ధి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మాజీ శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తోనే సాధ్యమైందని దేవాదాయ శాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తో పాటు ఆయన స్థానిక ఈ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించి వాసవి మాతను అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాతను దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెనుగొండ తర్వాత వాసవి మాత ప్రొద్దుటూరులో నడయాడిన చరిత్ర ఉందన్నారు. అలాంటి వాసవి మాతను ఎందరో స్వామీజీలు దర్శించుకున్న సంగతి గుర్తు చేశారు. తన వ్యక్తిగత పనుల నిమిత్తం ప్రొద్దుటూరుకు వచ్చానని స్థానిక మాజీ శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆహ్వానం మేరకు తాను అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో పలు రోడ్ల గుండా తిరిగే సమయంలో చూసిన అభివృద్ధి ఆశ్చర్యపోయానని విజయవాడలో రోడ్లు తీరు ఎలా ఉందో ప్రొద్దుటూరులో అలాంటి అభివృద్ధి జరగడం అభినందనీయమన్నారు. ఈ ఘనత స్థానిక శాసనసభ్యులు రాజమ దక్కిందని ఆయన కొనియాడారు. పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయని ఆ సమర్థ ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఆయన విమర్శించారు. ప్రజలకు ప్రధానంగా అవసరమైన త్రాగునీరు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని తెలిపారు. తిరిగి 2029లో రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని రాచమల్లు నేతృత్వంలో మరింత అభివృద్ధి చేస్తారని ఆయన ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే 2వ పేజీలో

### ఎల్ వీపీఈఐ ఆధ్వర్యంలో

## వైటాథాన్ అవగాహన వాక్..



**కడప కార్పొరేషన్ మే 17 ప్రభాతవార్త:**

పిల్లల్లో కనిపించే ప్రమాదకర కంటి క్యాన్సర్ వ్యాధి రెటినోబ్లాస్టోమాపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైటాథాన్ అవగాహన కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించారు. ఆదివారం కడప రాజీవ్ పార్క్ వద్ద జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మాధవిలత రిబ్బన్ కట్ చేసి.. మానవతా సేవాసంస్థ ఫౌండర్ రామచంద్ర రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పిల్లల కళ్లలో తెల్లటి ప్రతిబింబం కనిపించడం, చూపు సమస్యలు, కంటి వాపు వంటి లక్షణాలను నిరక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. రెటినోబ్లాస్టోమా వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా పిల్లల ప్రాణాలతో పాటు చూపును కూడా కాపాడవచ్చన్నారు. ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రాజశేఖర్ రెడ్డి కాంపస్ డైరెక్టర్ కావ్య మాధురి మాట్లాడుతూ వైటాథాన్ కార్యక్రమం ద్వారా రెటినోబ్లాస్టోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, చిన్నారుల్లో కంటి పరీక్షల ప్రాముఖ్యతను తెలపడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది, వైద్యులు పాల్గొని అవగాహన కల్పించారు.

## అంతర్జాతీయ ఎయిడ్స్‌కొవ్వొత్తుల స్మారక దినం



**జమ్మలమడుగు, మే 17, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రి నందు ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం జిల్లా కలెక్టర్ మరియు దిశ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రఫీక్ పాషా తెలిపారు. ఆసుపత్రిలో సాయంత్రం 6 నుంచి క్యాండిలైట్స్ డే కార్యక్రమం నిర్వహించి కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించడం జరిగిందన్నారు. సిబ్బంది మరియు క్లయింట్ అందరి సమక్షంలో ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ రామచంద్ర మరియు కౌన్సిలర్ శ్వేత రాణి లు మాట్లాడుతూ క్యాండిలైట్స్ డే ముఖ్య ఉద్దేశం ఎయిడ్స్ మృతుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించి నివాళులు అర్పించడమని తెలిపారు. జనరల్ మెడిసిన్ మంరియు హోమియోపతి మెడికల్ ఆఫీసర్ డా.వెంకట రాజేష్, డా.సూర్యనారాయణరెడ్డిలు మాట్లాడుతూ ఏటా మే నెల 3వ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల సమాజంలో ఉన్న అపోహలు, కళంకం, వివక్ష తొలగించడం యువతలో సురక్షిత లైంగిక ప్రవర్తన, కండోమ్ వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్టాఫ్, సెడ్స్ ఎన్‌జీవో సిబ్బంది శోభా, భారతి, పింకి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం



3వ పేజీలో

## ఎమ్మెల్యే వరద కుటుంబంపై రాచమల్లు ఆరోపణలు చేయడం తగదు



**ప్రొద్దుటూరు మే 17 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మరియు ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డి లపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నిత్యం అసత్య ఆరోపణలు చేయడం తగదని రాష్ట్ర షేక్ కార్పోరేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్ సూచించారు. ఆదివారం స్థానిక ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శనివారం కడప కలెక్టరేట్ లో ప్రొద్దుటూరు లో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, అదేవిధంగా మండలంలోని చౌడురు గ్రామ ఏరులో అభివృద్ధి పేరుతో పేద రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిని ఏపీఐఐసి కి అప్పజెప్పి, పారిశ్రామికీకరణ పేరుతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డి ఇసుకను ప్రక్క అక్రమంగా తరలించి ధనర్జాన చేస్తున్నారని ఆరోపించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం వుందని, ఎవరూ ఇసుకను అటువంటి తరుణంలో కొనుగోలు చేయరనే విషయం మరిచారా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో గత ప్రభుత్వంలో రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఇసుకను ప్రక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుని ప్రొద్దుటూరులో ఇసుకను మాయం చేశారని, అదే విధంగా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో వదిలారని, గత ప్రభుత్వంలో రాచమల్లు అభివృద్ధి పనులు చేయకుండానే బిల్లులు తెప్పించుకున్నారని విమర్శించారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం నెరవేర్చలేదని గతంలో వారి ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఒక చేత్తో ఇంటి పట్టా, మరోక చేత్తో తాళంచెవి ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వ్యవస్థ లను రాచమల్లు అదుపులో పెట్టుకొని, అసాంఘిక కార్యకలాపాలకు ప్రొద్దుటూరును అడ్డాగా చేశారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి రాష్ట్రంలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆయనకు భంగపాటు తప్పదన్నారు. గతంలో తామంతా ప్రవీణ్ కు సహకరించామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నిజాయితీ తెలుసుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాబయ్య, టిడిపి నాయకులు షబ్బీర్, ఖాదర్ వల్లీ, ఖలీల్, జనసేన నాయకులు జిలానీ బాష తదితరులు పాల్గొన్నారు.

## 20న మెడికల్ షాపులు మూసివేత



**దువ్వూరు, మే 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులో ఈనెల 20వ తేదీ బుధవారం మెడికల్ షాపులను మూసివేస్తున్నట్లు సంఘం నాయకులు సత్యనారాయణ, అమీర్ భాష, అశోక్ లు తెలిపారు. ఇటీవల మందుల విక్రయాల్లో ఆన్ లైన్ ఫార్మసీతో తీవ్రంగా నష్టపోతున్నామని, నియంత్రణ లేని డిస్కౌంట్ ఇస్తున్నారని, అక్రమ ఈ ఫార్మసీల ద్వారా భారీ డిస్కౌంట్లు అందజేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ షాపులు జరగకుండా ఉన్నాయని, ఆల్ ఇండియ మెడికల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెను చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద కార్పొరేట్ సంస్థలు తమ బ్రాంచ్లను ఏర్పాటు చేసి అధిక డిస్కౌంట్లు ఇస్తున్నాయని అలాగే వ్యాపారానికి సంబంధించి డిస్కౌంట్లు ఇవ్వడంతో మెడికల్ షాపుల వైపు ఎవరూ రావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కొరకు 20వ తేదీన మెడికల్ షాపులను మూసి వేస్తున్నట్లు వారు తెలిపారు. తాము వ్యాపారానికి సంబంధించిన విషయంగా చేయడం లేదని రోగులకు బాధ్యత వహించేందుకు ఈ సమ్మెను చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దువ్వూరు ఎస్ఐ ధనుంజయదుకు మెడికల్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు.

## ఘనంగా ముగిసిన అండర్12,14 క్రికెట్ టోర్నమెంట్

### లీగ్ విజేతలకు ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు

**పులివెందుల, మే 17, ప్రభాతవార్త :**

పులివెందుల పట్టణంలోని అంబకపల్లి సర్కిల్‌లో ఉన్న రాయలసీమ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాయలసీమ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) అండర్12, అండర్14 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. చిన్న వయస్సు నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ అలవడుతాయని పేర్కొన్నారు. చిన్నారుల కోసం విజయవంతంగా రాయలసీమ ప్రీమియర్ లీగ్ నిర్వహించిన రాయలసీమ క్రికెట్ అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల రాఘవరెడ్డి, పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్, అకాడమీ నిర్వాహకులు నిత్యానంద రెడ్డి, బొజ్జా మైసూరా రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, అజమాతుల్లా, క్రీడాభిమానులు, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.









### కాంట్రాక్ట్ కార్మికులతో

## ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



**దువ్వూరు, మే 17, ప్రభాతవార్త:**

విద్యుత్ శాఖలో ఏర్పడిన ఖాళీ పోస్టులను కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్, జిల్లా అధ్యక్షులు నాగ సుబ్బయ్య, శీలం సుబ్బరాయుడు లు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన దువ్వూరులో వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఇటీవల ఏర్పడిన తక్షణం వారితో భర్తీ చేయాలని కోరారు. అలాగే జూనియర్ లైన్ మెన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, అదనపు పోస్టులు మంజూరు చేయాలని, మెడికల్ పాలసీని వెంటనే తీసుకురావాలని, విద్యుత్ శాఖ కార్మికులకు మూడు డిఏ లు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామ్మోహన్, రవికుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


30 YEARS ANNIVERSARY
'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సంచాలనాలకు మారుపేరుగా తాజా సమాచారాన్ని పాఠకులకు చేరవేస్తూ, హరివిల్లు రంగులతో పోటీ పత్రికలకు ధీటుగా ఎదుగుతున్న వార్త సిబ్బందికి, యాజమాన్యానికి మా హార్థిక శుభాకాంక్షలు
సబ్‌రిజిస్ట్రార్ అర్బన్
పాతరిమ్స్, కడప.
సబ్‌రిజిస్ట్రార్ రూరల్
బాలాజీనగర్, కడప.

# తెలుగుదేశం పార్టీ కాదు అది తెలుగు జాతి ఆత్మ గౌరవం..

**సుండుపల్లె, మే 17, ప్రభాతవార్త:**
కువైట్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఎన్ఆర్ఐ, టిడిపి కువైట్ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగిందని, పార్టీ వ్యవ స్థాపకుడు స్వర్గీయ ఎన్టి రామారావు ఆశయాలను స్మరించుకుంటూ, అలాగే పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వానికి సంఘీభావం తెలుపుతూ ఈ మహానాడు వేడుకలను కువైట్‌లోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొని ఈ మహానాడును విజయవంతం చేశారని,ప్రారంభంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారని సుగావాసి యువసేన అధ్యక్షుడు ఎన్ఆర్ఐ కంచన.రెడ్డి శేఖర్ తెలిపాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ పలమనేరు మ్మెల్యే మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, షాప్ చెర్మన్ అనిమిని. రవినాయుడు, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు,సుండుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ నాయుడు, నక్షత్ర బిల్డర్ భరత్ రెడ్డి, ప్రీతంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గల్ఫ్ కౌన్సిల్ సభ్యులు వెంకట్. కోడూరి, సౌదీ అరేబియా నుండి ప్రభాకర్ రెడ్డి, రహంతుల్లా, కిషోర్ నాయుడు, సుగవాసి యువసేన కమిటీ సభ్యులు హాజరయ్యారన్నారు. తెలుగుదేశం పార్టీ అనేది ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాదు.. అది తెలుగు జాతి ఆత్మగౌరవానికి పునాది వేసిందని వెంకట్ కోడూరి అన్నారు. సుగావాసి మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ అనేది కొత్తగా వచ్చినది కాదు ఇది మా ఇంటి రక్తంలో ఉన్నది నా తండ్రి ఆఖరి శ్వాస వరకు పార్టీ కోసం కష్టపడ్డారన్నారు. కంచన రెడ్డిశేఖర్ సహకారంతో 50 మందికి పైగా యువకులు వైసీపీ నుంచి టీడీపీ లోకి చేరడం జరిగిందన్నారు.



# నూతన వార్డులకు ప్రభుత్వం ఆమోదం

**యర్రగుంట్ల మే17, ప్రభాతవార్త:**
యర్రగుంట్ల మున్సిపాలిటీ 20 వార్డులను 28 మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటి సరిహద్దు వివరాలు యర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులో సంబంధిత సమాచారం ప్రచురించినట్లు తెలిపారు. ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే ఈనెల 24 లోపు మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని ఆదివారం కమీషనర్ శేషఫణి కోరారు.




# పూర్వ విద్యార్థుల కలయిక




**మైదుకూరు, మే 17, ప్రభాతవార్త:**
మైదుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల 1999, 2000 సంవత్సర ఆత్మీయ కలయిక కడప రోడ్డు బస్టాండ్ ఎస్.ఆర్ నందు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు కుటుంబ సభ్యులతో సహా దూర ప్రాంతాల నుంచి వచ్చి ఈ కార్యక్రమాన్ని చాలా విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉద్దేశించి వారి యొక్క అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అంతేకాకుండా విద్యార్థులు వారితో కూడిన మధుర స్మృతులను బాల్యంలో తాము చదువుకున్న పాఠశాలలో తీపి గుర్తులను గుర్తుతెచ్చుకొని సరదాగా నవ్వులతో ఒకరికొకరు ఆనందాలను పంచుకున్నారు. అప్పటి బాల్య స్నేహితుల తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎక్కడ కెక్కడో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని తమ తమ ఉపన్యాసాలలో ఆత్మీయంగా గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరు వారి యొక్క తరగతి జ్ఞాపకాలను అందరితో పంచుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత శిఖరాలను చేరుకున్నందుకు చాలా సంతోషించారు. పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని తమ తమ ఉపన్యాసాలలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు చలమయ్య, బి.పుల్లయ్య, బి.నరసింహులు, బి.సుబ్బరాయుడు, ఎస్.ఎం అన్వర్, ఎం అబ్దుల్ వాహబ్, ఆర్ రఘునాథ్, వారిని మహిళ పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించడం జరిగింది. మధ్యాహ్నం భోజనం అనంతరం తీపి గుర్తులతో జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో పూర్వ విద్యార్థులు, మహిళలు, 26 సంవత్సరాల కలయిక ఆనందోత్సవాల మధ్యన ఆనందంగా గడుపుతూ ఒకరినొకరు సంతోషాలతో కుటుంబ సభ్యులతో ఆప్యాయత పలకరింపులతో ఎంతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అందరినీ కలుపుకొని ఎంతో శ్రమపడి అందరిని కలుస్తూ వారితో ఫోన్లో మాట్లాడుతూ ఆర్గనైజింగ్ చేసిన వారికి పూర్వ విద్యార్థులు ఎంతో రుణపడి ఉంటామని అభినందనలు తెలియజేశారు.

# లక్ష్య కార్డియాక్‌లో ఉచిత వైద్య శిబిరం

**ప్రొద్దుటూరు అర్బన్ మే 17 ప్రభాతవార్త**



ప్రతి నెల మూడవ ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న లక్ష్య హాస్పిటల్ నందు పేద ప్రజల కోసం ఉచిత కంటి మరియు గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం 61వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి 46 మంది రోగులను ఉచితంగా పరీక్షించి వీరిలో 25 మందికి ఉచితంగా ఇసిజి, 9 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ చేసి రోగులకు తగు చికిత్స, సూచనలు ఇచ్చారు.డాక్టర్ హరిత 38 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, వారికి తగు చికిత్స, సూచనలు అందించారు.

ఇరువురు వ్యక్తులు ఘర్షణ

# వ్యక్తిపై కొడవలితో దాడి

**ముద్దనూరు, మే 17 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఉప్పలూరులో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. ఇరువురి మధ్య వ్యక్తిగత గొడవ నేపథ్యం ఇరువురు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన లక్ష్మీ నరసయ్య, పాలగిరి బాల వీరయ్యల మధ్య గొడవలో ఆగ్రహించిన లక్ష్మీ నరసయ్య బాల వీరయ్యపై మచ్చుకొడవలితో ఒక్కసారిగా దాడి చేయగా బాల వీరయ్యకు తలకు చేతులకు గాయాలైన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు. ఘటనా స్థలాన్ని జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు, స్థానిక సిఐ నగేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని గొడవకు గల కారణాలను ఆరాదీశారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రశాంతంగా పరిష్కరించుకోవాలన్నారు. బాధితుని కుమారుడు పాలగిరి వినోద్ ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య చికిత్సకు లయన్స్ క్లబ్ ఆర్థిక చేయూత



**నందలూరు, మే 17 ప్రభాతవార్త :**
నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బోనాసి వంశీ బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న నందలూరు లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు మానవత్వంతో స్పందించారు. బాధితుడి తండ్రి బోనాసి కిషోర్‌కు క్లబ్ ఫండ్ ద్వారా రూ.20 వేలతో పాటు దాతల సహకారంతో మొత్తం రూ.72 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి చేయూతనివ్వాలని క్లబ్ సభ్యులు కోరారు.కార్యక్రమంలో డాక్టర్ జయభాస్కర్ రావు, లయన్ మన్నెం రామమోహన్, లయన్ కుర్రా మణి యాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, దాసరి నరసింహులు, మోడపోతుల రాము, గంధం గంగాధర్, మంటి మారయ్య, జంగంశెట్టి చంద్ర, గుండు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుడిపై రాజకీయ కక్షతోనే నాడు కేసులు

వైసీపీ నాయకుల రౌడీషీటర్ల చరిత్రేంటో ప్రజలకు తెలుసు"

ఆరోపణలపై ఆధారాలతో బయటపెడతాం

వైసీపీ ఆరోపణలకు టీడీపీ నాయకుల ఘాటు ప్రతిస్పందన




**పులివెందుల, మే 17, ప్రభాతవార్త :**
టీడీపీ చెందిన విజయ కుమార్‌రెడ్డిపై నాడు రాజకీయ కక్షతో మీరు పెట్టిన కేసులేనని మీ నాయకుల రౌడీ షీటర్ల చరిత్ర ఏంటో ప్రజలందరికీ తెలుసు అని టీడీపీ నాయకులు షేక్ ఖాసీం, దుంప వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకుడు అక్కుల విజయ్‌కుమార్‌రెడ్డిపై చేసిన ఆరోపణలకు తీవ్ర స్థాయిలో ప్రతిస్పందించారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, వాస్తవాలను వక్రీకరిస్తు న్నారని ఆరోపించారు.మా టీడీపీ నాయకుడు అక్కుల విజయ్‌కుమార్‌రెడ్డిపై నమోదైన కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగంగా పెట్టినవేనని పేర్కొన్న వారు, వాటిని ఆధారంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడడం సరైంది కాదన్నారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి ఎదుగుతారని, ఎవరు పుట్టుకతోనే ధనవంతులు కారని వ్యాఖ్యానించారు. వైసీపీ నాయకుల చుట్టూ తీవ్రమైన నేర ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులు ఉన్నారని ఆరోపిస్తూ, హత్యలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నవారు తమ పార్టీలో లేరన్నారు. గత ఘటనలను ప్రజలు మర్చిపోలేదన్నారు. కొంతమంది నాయకులు మైనింగ్, వ్యవసాయ రంగాల్లో అక్రమ ఒప్పందాలు, షేర్ల పేరుతో భారీ మొత్తంలో డబ్బులు సంపాదించారని ఆరోపించారు. భారీ భవనాలు, ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కుల విజయ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలపై చేసిన విమర్శలను కూడా వారు ఖండించారు. కార్యక్రమానికి హాజరైన వారంతా పెద్ద వారేనని, అభిమానంతో స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. దీనిని రాజకీయ రంగు పులమడం తగద న్నారు.ఆస్తులు, వాహనాల విషయంలో చేసిన ఆరో పణలపై స్పందిస్తూ తమ నాయకుడు అన్ని పన్నులు క్రమం తప్పకుండా చెల్లిస్తు న్నారని చెప్పారు. అయితే నగిరిగుట్ట ప్రాంతంలో ఒక మాజీ కౌన్సిలర్ ఇంటికి తక్కువ పన్నులు చెల్లిస్తు న్నారంటూ ఆరోపిస్తూ దీనిపై మున్సిపల్ అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తప్పుడు ధృవపత్రాలతో వికలాంగుల పెన్షన్ పొందుతున్నారంటూ మరో మాజీ ప్రజాప్రతినిధి కుటుంబంపై ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని మోసం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జూదం వ్యవహారాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదని, గతంలో మట్కా వ్యవహారాలతో సంబంధాలు ఉన్న వారితో ఎవరు ఉన్నారో ప్రజలకు తెలుసని అన్నారు. భూకబ్జాల అంశంపై కూడా తీవ్ర ఆరోపణలు చేసిన టీడీపీ నేతలు, పులివెందుల పరిసర ప్రాంతాల్లో జరిగిన భూ ఆక్రమణల వివరాలను త్వరలో ఆధారాలతో ప్రజల ముందుంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షేక్ కాశీం (వైఎస్సార్ జిల్లా ముస్లిం మైనారిటీ అధికార ప్రతినిధి), దుంప వెంకటేశ్వర రెడ్డి, షామీర్ బాషా, సాతుపాటి రఘు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన మెగా ఉచిత వైద్య శిబిరం

**ప్రొద్దుటూరు అర్బన్ , మే 17, ప్రభాతవార్త**
లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో వాసవి కళ్యాణ మండపం వారి సౌజన్యంతో కడప డాక్టర్ మోహన్ డయాబెటిక్ వారి సహాయ సహకారములతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో 3,200రూపాయలు విలువ చేసే లివర్ స్కానింగ్, షుగర్ వ్యాధి, కంటి పరీక్షలు, లివర్ సంబంధిత సమస్యలకు 500 మందికీ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు లయన్స్ క్లబ్ వారు మాట్లాడుతూ ఈ వైద్య సేవలు అందించిన కడపకు చెందిన డాక్టర్ మోహన్ డయాబెటిక్, పుష్పగిరి హాస్పిటల్, పార్థ డెంటల్ హాస్పిటల్ చెందిన వైద్యులు డాక్టర్ మోనిక,డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మనస్విని, డాక్టర్ అరుణ్ గోపిలకు ప్రొద్దుటూరు లయన్స్ క్లబ్ తరపున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కామేశ్వరరావు, లైన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చంద్ర ప్రకాష్ రావు, డిస్ట్రిక్ట్ చైర్మన్ నిచ్చెనమెట్ల సత్యనారాయణ, సెక్రటరీ బచ్చు అశోక్, ట్రెజరర్ రాంగోపాల్ శర్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కామిశెట్టి కృష్ణమూర్తి, పసపల సుబ్రహ్మణ్యం, జూటూరు పద్మనాభయ్య, వల్లంకొండు మనోహర్, వాసవి కళ్యాణ మండపం సెక్రెటరీ కాకుమాని చంద్రమోహన్రావు తదితరులు పాల్గొన్నారు.





# రెడ్డి సేవా సంఘం అధ్యక్షుని పరామర్శించిన నాయకులు

**బద్వేలు అర్బన్ మే 17: ప్రభాతవార్త**
రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డికి ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి కుడి భుజం దగ్గర ఫ్రాక్చర్ అయినది .ఆది వారం కడప విద్యాసాగర్ హాస్పిటల్ నందు శస్త్ర చికిత్స జరిగిందని విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కొంకెల రాంబాబు గంగసాని సాంబశివారెడ్డి ని పరామర్శించి మిత్రులు త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. ఈ సందర్భంగా కొంకెల రాంబాబు ,ఫ్రెండ్స్ సేవా సభ్యులు మాట్లాడుతూ గంగసాని సాంబశివారెడ్డి ఫ్రెండ్స్ సేవా సంఘంలోనూ అలాగే బద్దెన కళాపీఠంలోనూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవాభావంతో అనేక కార్యక్రమాలు నిర్వహించేవారుఅని ఆయనకు ఇలా జరగడం చాలా దురదృష్టకరమని ఫ్రెండ్స్ సేవా సభ్యులైన పలువురు బాధను వెలిబుచ్చారు. సాంబశివారెడ్డి త్వరగా కోలుకొని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షి ంచారు. పరామర్శించిన వారిలో ఆవాజ్ కమిటీ సభ్యులు ఎస్ ఎస్ సత్తార్ తోపాటు పలువురు రెడ్డి సేవా సంఘం సభ్యులు, ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులు పరామర్శించారు.



# మహిళ ఆత్మహత్యా

**రామసముద్రం మే 17 ప్రభాతవార్త**
కుటుంబ కలహాలతో మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ బసవన్న కట్ట గ్రామంలో చోటు చేసుకుంది, ఎస్సై హృషికేశవరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం బసవన్న కట్టకు చెందిన రమ్య ను విజయ్ కుమారుడు తేజ కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె ఉంది.గత కొంత కాలంగా భార్యాభర్త ల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి.ఈ నేపథ్యంలో రమ్య మనస్తాపం చెంది ఆదివారం ఎలుకలు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి రమ్యను హుటాహుటిన పుంగనూరు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు, చికిత్స పొందుతూ రమ్య మరణించింది.

# జనసేన బలోపేతం అతికారి కృష్ణకే సాధ్యం

**సిద్దవటం మే 17 ప్రభాతవార్త**



జనసేన పార్టీ బలోపేతానికి రాబోయే స్థానిక ఎలక్షన్ దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతం కోసం రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ జనసేన పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనమయమని సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్స్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్ పేర్కొన్నారు మండలంలోని మాధవరం, 1 రామకృష్ణాపురం గ్రామంలో తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ సేవలు కార్యకర్తలు ఎప్పటికీ మరవలేని విషయమని ఆయన పార్టీ సభ్యత నమోదులో రాష్ట్రస్థాయిలో ఒక చరిత్ర సృష్టించాడని అధినాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించిన బాటలో ఆయన పార్టీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వైసీపీ చేసిన మోసాలను ఎండ కొడుతూ ప్రజలకు తెలుపుతున్నాడని నమ్ముకున్న వ్యక్తులకు న్యాయం చేసే ధీటైన అధినేత అతికారి కృష్ణ అని తెలిపారు నిరంతరం నిరుపేదలకు ఎంతోమందికి ఆర్థికంగా సేవా కార్యక్రమాలు చేసి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అలాంటి వ్యక్తికి రాష్ట్ర అధినాయకత్వం సరైన గుర్తింపు త్వరలో అందించబోతున్నారని తెలిపారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ ఐకమత్యంతో ముందుకెళ్లి అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని తెలిపారు పేద బలహీన వర్గాల కుటుంబాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక వ్యక్తి అతి కారి కృష్ణ అని తెలిపారు స్వార్థ రాజకీయాలు నీచ రాజకీయాలు ఆయన ఏనాడు ప్రోత్సహించాడని నిరంతరం రాష్ట్ర కమిటీ సూచన మేరకు కట్టుబడి పార్టీ విజయం కోసం కష్టపడే వ్యక్తి ఆయనే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్ పేర్కొన్నారు.

# పురపాలక సంఘం వార్డుల పునర్విభజన,

**మైదుకూరు, మే 17, ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వారు వారి ఆర్.ఓ.సి.నెం. 13032/2/2026/బీ12,తేది::01.04.2026, నందు మైదుకూరు పురపాలక సంఘం నందు గల 24 ఎలక్షన్ వార్డులను 32 వార్డులుగా పునర్విభజన కొరకు ఫారం నెం.1 రూల్ నెం.4() నోటిఫికేషన్ కాపీని ప్రచురించి ప్రజల సలహాలు మరియు సూచనల కొరకు అన్ని ప్రభుత్వ కార్యాలయల నోటీసు బోర్డు నందు 7 రోజులు ప్రచురించ వలసినది గా ఉత్తర్వులు జారీ చేసియున్నారు.కావున ఇందు మూలముగా మైదుకూరు పురపాలక సంఘం పరిదిలోని ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై తెలిపిన ప్రభుత్వ ఉత్తర్వుల ఆదేశములు మేరకు ఫారం నెం.1 రూల్ నెం.4() నోటిఫికేషన్ కాపీను జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము కడప, రెవిన్యూ డివిజనల్ వారి కార్యాలయము బద్వేల్ మరియు మైదుకూరు నందు గల అన్ని ప్రభుత్వ కార్యాలయల నందు ప్రజల సలహాలు మరియు సూచనల కొరకు ఉంచుతూ, ప్రజలు వారి సలహాలు మరియు సూచనలను తేది. 24.05.2026 లోపు మైదుకూరు పురపాలక సంఘం వారి కార్యాలయము, నందు వ్రాత పూర్వకముగా సమర్పించ వలసినదిగా కోరడమైనది.

ముఖ్యమంత్రి గారూ

# బిడ్డల్ని కనడం సరే మరి సాకేదెవరు ?

**వేంపల్లి మే 17 ప్రభాతవార్త**



ఎక్కువ మంది పిల్లల్ని కనండి. మూడవ బిడ్డ పుడితే రు 30,000లు, నాలుగో బిడ్డ పుడితే రు 40,000లు అని ముఖ్యమంత్రి చంద్రబాబు వేలం పాట పాడడం గర్హనీయం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లిలో తులసిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలో 242 దేశాలు ఉన్నాయని, ప్రపంచ జనాభా 809 కోట్లని అన్నారు. ఇందులో భారతదేశం జనాభా 147 కోట్లని,మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రపంచ సగటు జనసాంద్రత 55 కాగా, భారతదేశపు జనసాంద్రత 488, చైనా జన సాంద్రత 151, అమెరికా జనసాంద్రత 38, రష్యా జనసాంద్రత 9 అన్నారు. ఉన్న జనాభాకే, ప్రత్యేకించి యువతకు ఉద్యోగాలు లేక ఉపాధి లేక మద్యానికి, డ్రగ్స్‌కు, గంజాయికి, జూదానికి బానిసలై సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది పిల్లల్ని కనడం అవసరమా అని తులసిరెడ్డి ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా, స్థానిక, స్థానికేతర అంశం రోజురోజుకు ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో ప్రవాస భారతీయులు భారతదేశానికి, ప్రవాసాంధులు ఆంధ్రప్రదేశ్‌కు తిరిగివచ్చే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నవాళ్ళకే ఉపాధి లేకుండా ఉంటే ప్రవాస భారతీయులకు, ప్రవాస ఆంధ్రులకు ఉపాధి ఎక్కడ లభిస్తుందని తులసిరెడ్డి ప్రశ్నించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు జపాన్, దక్షిణ కొరియా దేశాలతో పోల్చుకొని చంద్రబాబు మాట్లాడడం సమంజసం కాదని తులసిరెడ్డి అన్నారు. జనసాంద్రత చదరపు కిలోమీటర్లకు 340. ఆ దేశంతో మన దేశాన్ని పోల్చుకోవడం అవివేకం. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకే దిక్కులేదు.సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైన నిరుద్యోగ భృతి,ఆడబిడ్డ నిధి,బీసీ, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ హామీలు అమలు కావడం లేదు. అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుంది ప్రభుత్వ వాలకం. గుర్రపు నాడా దొరికిందని గుర్రాన్ని కొని గుగ్గిళ్ళు పెట్టలేక అవస్థపడినట్లు ఉందన్న సామెత గుర్తుకు వస్తోంది. ఎక్కువ మంది పిల్లల్ని కనాలి అన్న ఆలోచన కచ్చితంగా తిరోగమన ఆలోచన. ముఖ్యమంత్రి కేమో ఒక బిడ్డ, ముఖ్యమంత్రి కుమారునికేమో ఒక బిడ్డ,కానీ ప్రజలేమో ముగ్గురిని నలుగురిని, ఇంకా ఎక్కువ మందిని కనండి అని పిలుపు ఇవ్వడం విడ్డూరం. ముఖ్యమంత్రి పునరాలోచించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

40 వార్డులుగా పునర్విభజన మే 24 లోపు

# సలహాలు, సూచనలకు అవకాశం

**బద్వేల్ అర్బన్, మే 17 (ప్రభాతవార్త):**
బద్వేలు పురపాలక సంఘం (మున్సిపాలిటీ) పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం ఉన్న 35 ఎలక్షన్ వార్డులను 40 వార్డులుగా పునర్విభజన చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు (ఆర్.ఓ.సి.నెం.13032/2/2026/బీ12, తేది: 21.04.2026) జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీస్ (నగర పంచాయతీలు మరియు మునిసిపాలిటీలను వార్డులుగా విభజించడం) నియమాల్లోని రూల్ నెం. 4(1), జి.ఓ.ఎం.ఎస్.నెం. 31 నిబంధనల మేరకు ఫారమ్ నెం.1 నోటిఫికేషన్ కాపీని ప్రచురించారు. ప్రజల సలహాలు, సూచనల కొరకు ఈ నోటిఫికేషన్ కాపీని 7 రోజుల పాటు అన్ని ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై అందుబాటులో ఉంచనున్నారు.

**మే 24 లోపు స్పందించాలి**

బద్వేలు పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు, మేధావులు ఈ వార్డుల పునర్విభజనపై తమకు ఏవైనా సలహాలు, సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా (రాతపూర్వకంగా) ఈనెల 24వ తేదీ (24.05.2026) లోపు బద్వేలు పురపాలక సంఘ కార్యాలయంలో సమర్పించవలసిందిగా అధికారులు కోరారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.




విద్యుత్ బస్సుల పేరుతో ప్రభుత్వం

# ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం విరమించుకోవాలి

ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్

**ప్రొద్దుటూరు మే 17 ప్రభాతవార్త**
రాష్ట్రంలో విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వాలు తక్షణమే విరమించుకోవాలని లేదంటే ఐక్య ఉద్యమాలతో ఆందోళనలు చేపడతామని ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి ఎన్ రాజశేఖర్ డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో విద్యుత్ బస్సులను పూర్తిగా ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పజెప్పి దశలవారీగా ఆర్టీసీ సిబ్బందిని డిపోలను కుదించి ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలని అలాగే ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం విజయవంతం చేస్తున్న ఉద్యోగుల ఇబ్బందులను పట్టించుకోకుండా పనిష్మెంట్లు ఇవ్వడాన్ని వారు తీవ్రంగా ఖండించారు ఈ పథకం విజయవంతానికి మూడు వేల కొత్త బస్సులు కొనుగోలు చేయాలని వివిధ కేటగిరిలో ఉన్న పదివేల ఖాళీల నియామకాలు చేపట్టి సంస్థలు బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఉద్యోగ భద్రత సర్కులర్ 01/2019 ని సక్రమంగా అమలు చేయాలని ఆన్ డ్యూటీ లో ఉన్న సిబ్బందిపై దాడులు చేస్తున్న వారిపై నాన్బెయిలబుల్ కేసులు పెట్టాలని కాలం చెల్లిన టీం మిషన్స్ ను రీప్లేస్ చేయాలని ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలతో పాటు ఐఆర్ ప్రకటించి 12వ పిఆర్సి కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. డిపో అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌వికె రెడ్డి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ గ్రేడ్ 2 మెకానికులకు సంబంధించి ఏ ఏ ఎస్ ఇంక్రిమెంట్లలో జరిగిన అన్యాయాన్ని సరిచేసి లీడింగ్ హ్యాండ్ స్కేల్ తో వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో జోనల్ నాయకులు పిఎన్ పి రెడ్డి సి ఆర్ ఎల్ రెడ్డి జిల్లా నాయకులు ఎస్ ఎన్ కే రెడ్డి మెయింటెనెన్స్ కమిటీ సభ్యులు బిఆర్జి రెడ్డి ప్రొద్దుటూరు డిపో నాయకులు ఆర్ఎస్ రెడ్డి ఈ వెంకటేశ్వర్లు మాధవుడు మార్బుల్ అనీష్ ఏ శ్రీనివాసులు శాంతకుమారి ప్రసన్న పవన్ ఆర్డి బాబు మరియు ఉద్యోగులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్యులకు పెద్దపీట వేసిన ఘనత జగన్‌కే దక్కింది

రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంపద సృష్టి అంటే జనాభాను పెంచడమేనా అని ఎద్దేవా చేశారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సంపద సృష్టించి అభివృద్ధి సంక్షేమం పరుగులు పెట్టిస్తానని ప్రజలకు మాయమాటలు చెప్పిన సంగతిని గుర్తు చేశారు అధికారం చేపట్టిన అనంతరం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మరోసారి ప్రజలను చంద్రబాబు మోసం చేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనించాలని భవిష్యత్తులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ టీటీడీ బోర్డు పాలకమండలి సభ్య లు చిప్పగిరి వెంకటప్రసాద్ మారుతి ప్రసాద్ మరియు ఆర్యవైశ్య సభ సభ్యులు పాల్గొన్నారు.

## ఉరుసు ఉత్సవ కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి



పోస్టర్ల ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**పీలేరు, మే 17 ప్రభాతవార్త:**

అన్ని మతాల పండుగలకు, సంప్రదాయాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో అన్నమయ్య జిల్లా వాయల్పాడులోని హాజరత్ ఖ్వాజా పీర్ మస్తాన్ వలి దర్గాలో మూడు రోజులపాటు జరిగే గంధం, ఉరుసు ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ఆదివారం నగిరిపల్లిలోని తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వాయల్పాడు దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మైనారిటీ నాయకులు, మండల ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు ఎమ్మెల్యేను కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. కరపత్రాలు విడుదల చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ "మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుసు ఉత్సవాలు విజయవంతంగా జరిగేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించామని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, కూటమి, మైనారిటీ నాయకులు, ముస్లిం పెద్దలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్సిపల్ వార్డుల విభజనపై నేడు ప్రచురణ

**మదనపల్లె, మే 17 ప్రభాతవార్త :**

మదనపల్లె పురపాలకసంఘం ఎలక్షన్ వార్డుల డీ లిమిటేషన్ (వార్డుల విభజన)పై 18నుంచి 24వ తేది వరకు మున్సిపల్ కార్యాలయం, అన్ని ప్రభుత్వ కార్యాలయాల నందు నోటీస్ బోర్డుల్లో ప్రచురించడం జరుగుతుందని కమిషనర్ ప్రమీల ఓ ప్రకటనలో తెలిపారు. 1.1.2026 నాటికి ఉన్న ఓటర్ల సంఖ్య, 2011 జనాభా గణాంకాల ఆధారంగా ప్రస్తుతమున్న 35నుండి 48వార్డుల పునర్ విభజన ఆదేశాలు జారీ చేశారు. వార్డుల విభజనపై ఎవరికైనా సూచన లు, అభ్యంతరాలు ఉన్నయడల ఈ ప్రకటన వెలుబడిన తేదినుండి 7రోజుల్లోపు అభ్యంతరాలు పురపాలకసంఘంకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

## సేవాభారతి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**రామసముద్రం మే 17 ప్రభాతవార్త**

రామసముద్రం సేవా భారతి ఆధ్వర్యంలో శంకర నేత్రలయ హాస్పిటల్ మిషన్ ఫర్ విజన్ చెన్నై వారిచే ఆదివారం బజారు వీధిలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 50 మంది హాజరైనట్లు శంకర నేత్రలయ డాక్టర్ మురళి తెలిపారు. ఇందులో 25 మందికి శుక్లముల ఆపరేషన్ లు చేయాలని వైద్యులు తెలిపారు, వీరందరికి చెన్నై లోని శంకర నేత్రలయంలో ఉచితంగా కంటి శుక్లముల ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. డాక్టర్ లు, కార్యనిర్వాహకులు మాట్లాడుతూ శంకర నేత్రలయం వారి ఆధ్వర్యంలో గతంలో అనేక వైద్య శిబిరాలు జరిగాయని, వేలాదిమంది పేదలు ఈ ఆసుపత్రి ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకొని, కంటి శుక్లముల ఆపరేషన్ లు కూడ చేయించు కున్నారని తెలిపారు. భవిష్యత్‌లో కూడ ఇదే విధంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు జరుగుతాయని, పేదలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు, సేవా భారతి రామసముద్రం వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు, ఈ ఉచిత శిబిరంలో పాల్గొన్న డాక్టర్ లు మురళి, భాస్కర్, నరసింహులు గుప్తా, రవీంద్రనాథ్ రెడ్డి, మల్లిఖార్జున రావు, సుదర్శన్ గుప్తా, టీచర్ వెంకటరమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి నగర్‌లో నీటి ఎద్దడి

### మరమ్మత్తులకు గురైన బోరు మోటార్



**మదనపల్లె, మే 17 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అనపగుట్ట వద్ద ఉన్న శ్రీవారినగర్‌లో గత ఐదు రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. బోరుమోటార్ మరమ్మత్తులకు గురికావడంతో నీటి సమస్య నెలకొంది. పట్టణ శివారు ప్రాంతంగా ఉంటున్న శ్రీవారినగర్‌లో నీటి ఎద్దడి ఉండడం వల్ల తాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటర్ ట్యాంకు రూ. 500ల నుంచి 600వరకు కొనుగోలు చేసి తెచ్చుకొంటున్నారు. బోర్లల్లో కూడా నీరు తగ్గడం వల్ల అరకొరకగానే నీళ్ళు సరఫరా అవుతున్నాయంటూ మున్సిపల్ వాటర్‌మెన్ తెలిపారు. దీనికి తోడు బోరు మోటార్ మరమ్మత్తులకు గురి కావడంతో నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. బోరుమోటార్ పరిధిలో అధికగమించి వాటర్ కనెక్షన్లు ఇవ్వడం వల్ల కూడా శ్రీవారినగర్‌లో ఉన్న వారందరికి నీటి సరఫరా కాలేకపోతోంది. జగన్‌కాలనీ వాసులకు కూడా ఈ బోరు మోటార్ నుంచే వాటర్ కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. మున్సిపల్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు స్పందించి మరమ్మత్తులకు గురైన బోరుమోటార్‌ను మరమ్మత్తులు చేయించి శ్రీవారినగర్‌లో నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ



**వాల్మీకిపురం, మే 17 ప్రభాతవార్త:**

స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ, వైద్య సిబ్బంది సంయుక్తంగా కొవ్వొత్తులను వెలిగించి ఎయిడ్స్ కారణంగా మరణించిన వారి ఆత్మశాంతి కోసం కొంత సేపు మౌనం పాటించి వారికి నివాళులు అర్పించిన అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు అమూల్య, ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్ వైద్యసిబ్బంది, మంజుల, లావణ్య, ఆర్ఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు మోనిక, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి టీడీపీ భరోసా

### రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు పంపిణీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు, మే 17 ప్రభాతవార్త:**

కార్యకర్తలే పార్టీకి బలమని, వారి కుటుంబాలకు అండగా ఉండటమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని పీలేరు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతల వారిపల్లి వద్ద నాలుగు నెలల క్రితం జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యుడు ఎం. రుద్రయ్య కుటుంబానికి పార్టీ తరఫున మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును. ఆయన భార్య ఎం. మాధవికి ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ఆదివారం కలికిరి నగిరి పల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త "రుద్రయ్య పార్టీకి సేవలందించిన నిబద్ధత గల కార్యకర్త. టీడీపీ సభ్యత్వం కలిగి ఉన్నందున పార్టీ ప్రమాద బీమా పథకం వర్తించింది. నా సిఫారసుతో వెంటనే ప్రక్రియ పూర్తి చేసి చెక్కు మంజూరు చేయించాం. ఆ కుటుంబం ఆత్మస్థైర్యంతో నిలబడేందుకు ఈ సాయం ఉపయోగపడుతుంది. చంద్రబాబు ఆదేశాలతో ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మృతుని భార్య మాధవి భావోద్వేగానికి లోనై పార్టీకి, ఎమ్మెల్యేకు వారి కుటుంబ సభ్యులతో పాటు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మృతుని భార్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

# కురుబకుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### సమాజ అభివృద్ధికి ఐక్యతతో ముందుకు సాగాలని నాయకుల పిలుపు

**పీలేరు మే 17 ప్రభాతవార్త :**

పీలేరు పట్టణంలోని ఎస్వీఎస్ఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం పీలేరు మండల కురుబకుల సంఘం మండల స్థాయి కమిటీ ఏర్పాటు సమావేశం ఘనంగా నిర్వహించబడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కురుబ బంధువులు, యువత, సంఘ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు, కలకడ మాజీ ఎంపీపీ కాంతారావు, లక్ష్మయ్య, రఘునాథ్, గుండ్లూరు శ్రీనివాసులు హాజరై కమిటీ ఎన్నికలను పర్యవేక్షించారు. వారి ఆధ్వర్యంలో పీలేరు మండల కురుబకుల సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కురుబ సమాజ అభివృద్ధి, విద్యా ప్రగతి, యువత ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక ఐక్యత, సంక్షేమ కార్యక్రమాల కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సమాజంలో కురబలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సభలో మాట్లాడిన నాయకులు కురుబ సమాజం ఐక్యతతో ముందుకు సాగినప్పుడే సమాజానికి తగిన గుర్తింపు, హక్కులు అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ పురోగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు సంఘ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కురుబ సంఘ రాష్ట్ర నాయకులు కనకదాసు విగ్రహం కూడా త్వరలోనే ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. కనకదాసు విగ్రహ ఏర్పాటుకు గోడ్రేవుపల్లి కురబ యూత్ నాయకులు లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మండల గౌరవ అధ్యక్షుడు: పి. ఎర్రయ్య, అధ్యక్షుడు: వసంతాల రాజా, ఉపాధ్యక్షుడు: బండి రామచంద్ర, ప్రధాన కార్యదర్శి: ఆవుల హితేష్, సహాయ కార్యదర్శి: ఆవుల నాగేంద్ర, ఆర్థిక కార్యదర్శి: ఆవుల సిద్దయ్య, గ్రామ ప్రతినిధులు: ముడుపులవేము గ్రామం: జి. అశోక్, రేగల్లు గ్రామం: అంకాలు, పీలేరు అర్బన్: రమణ, జండ్ల గ్రామం: శంకరయ్య, దొడ్డిపల్లి గ్రామం: సుధాకర్ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నిక కాబడ్డారు ఈ సభలో పాల్గొన్న నాయకులు, గ్రామ ప్రతినిధులు వీరిని అభినందించారు. సమాజ అభ్యున్నతికి నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు కురుబ బంధువులు తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన మండల స్థాయి కమిటీ

# రామసముద్రం మండలంలో ప్రశాంతతే లక్ష్యం

**శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు అదుపు..**
**జూద గృహాలు, కోడి పందాలపై ప్రత్యేక నిఘా..**
**రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక చర్యలు..**
**రామసముద్రం ఎస్సై హృషి కేశవరెడ్డి స్పష్టం..**
**ఎస్సైగా విధుల్లో చేరినప్పటి నుండి మండలంలో విస్తృత పర్యటన.**
**రైతులు, ప్రజలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు.**



**రామసముద్రం మే 17 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా కర్ణాటక సరిహద్దులో ఉన్న రామసముద్రం మండలంలో ప్రశాంతతను నెలకొల్పడమే తన లక్ష్యమని ఎస్సై హృషి కేశవరెడ్డి స్పష్టం చేశారు. హృషి కేశవరెడ్డి రామసముద్రం ఎస్సైగా విధుల్లో చేరినప్పటి నుండి మండలంలోని అనేక గ్రామాల్లో పర్యటిస్తూ నేరాల అదుపు కోసం ప్రయత్నిస్తున్నారు. ఎక్కడ రాజకీయ గొడవలు జరగకుండా అవగాహన ఇస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటకకు అతి సమీపంలో ఈ మండలం ఉండడంతో ప్రత్యేకంగా నిఘా ఉంచుతున్నారు. రెండు రాష్ట్రాల నుండి వెళ్లే వాహనాలు, లారీలను ఎప్పుడు కప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక నుండి అక్రమంగా మద్యం రానీయకుండా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నారు. అంతేకాకుండా పేకాట, కోడి పందాల పైన డేగ కన్ను పెట్టారు. రామసముద్రం మండలంలో కొండలు, గుట్టలు, అడవులు ఎక్కువగా ఉండటంతో జూదం, కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. వీటిని నియంత్రించేలా తన సిబ్బందితో ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం, నేరాలను అదుపు చేసేలా పలు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఐగా అతి తక్కువ సమయంలోనే తన మార్కును చూపిస్తున్నారు. మండల ప్రజలు, రైతులు, మహిళలకు పలు విషయాలపై అవగాహన ఇస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ భూ తగాదాలు, రాజకీయ గొడవలు, వివాహేతర సంబంధాల పైన అవేర్నెస్ కార్యక్రమాలు చేపడుతున్నారు. త్వరలోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో గ్రామాల్లో రాజకీయ వేడి నెలకొనే అవకాశం ఉంది. ఈ విషయంలో కూడా మండలంలో ఉన్న ప్రముఖ రాజకీయ నాయకులతో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా కృషి చేస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే ప్రజల నుండి ఎస్సై హృషి కేశవరెడ్డి మన్ననలు పొందుతున్నారు.

**ఎస్సై హృషి కేశవరెడ్డి నేపద్య జీవితం ఇది.**

నంద్యాల జిల్లా, గోస్పాడు మండలం, యం. చింతకుంట్ల గ్రామంలో రైతు కుటుంబంలో హృషి కేశవరెడ్డి జన్మించారు. చిన్నతనం నుండి చదువులో బాగా రాణిస్తున్నడంతో తల్లిదండ్రులు సుధా, జయసింహారెడ్డి బాగా చదివించారు. కర్నూల్లోని కేవీ. సుబ్బారెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. 2020లో ఎస్సై ఉద్యోగంలో చేరారు. కడప, పులివెందుల, కమలాపురంలో ఎస్ఐగా గతంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం రామసముద్రం ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# లాభసాటిగా పొట్టేళ్ల పిల్లల పెంపకం





**పీలేరు మే 17 ప్రభాతవార్త:**

ప్రస్తుతం మార్కెట్లో మాంసానికి ఉన్న గిరాకీ దృశ్య పొట్టేళ్ల పెంపకం పట్ల రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. జీవాల పెంపకం దారులతోపాటు వ్యవసాయదారులు మిశ్రమ వ్యవసాయంపై ఆసక్తిగా ఉన్నవారు. అదనపు ఆదాయం పొందడానికి నిరుద్యోగ గ్రామీణ యువతకు జీవనోపాధి కల్పనకు పొట్టేళ్ల పెంపకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరు మాసాల వ్యవధిలో ప్రతి పొట్టేళ్లపై సుమారు మూడు నుండి నాలుగు వేల రూపాయలు ఆదాయం పొందే అవకాశం ఉన్నాయి. ఆరోగ్యకరమైన పొట్టేళ్ల పిల్లలను కొనుగోలు చేసి ఆరు మాసాల పాటు శాస్త్రీయ పద్ధతుల్లో పోషణ చేస్తే 9 నెలల వయస్సుకి కనీసం 25 కిలోల బరువు పెరిగి అమ్మకానికి వస్తాయి. మూడు మాసాల వయసు పది నుంచి 12 కిలో గ్రాముల శరీర బరువు ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేసి పోషిస్తే తక్కువ మేపు ఖర్చుతో ఎక్కువ లాభం చేకూరుతుంది. ఈ వయసులో మేత వినిమయ సామర్థం ఎక్కువగా ఉండటం వలన పొట్టేలు పిల్లలు పెరుగుదల కనీసం రోజుకు 100 నుంచి 200 గ్రాములు అధికంగా ఉండి అధిక మాంస ఉత్పత్తి పొందే అవకాశం ఉంటుంది. ఒకే వయసు ఒకే జాతి మగ పిల్లల్ని ఎంపిక చేసుకోవాలి గొర్రె పిల్లలను సంతలలో కొనుగోలు కన్నా రైతుల వద్ద కొనుగోలు చేయటం మంచిది. సాంద్రపద్ధతిలో పెంచే ఈ పొట్టేళ్ల పెంపకానికి అధిక మాంసం ఉత్పత్తి ఇచ్చే నెల్లూరు దక్కని జాతి గొర్రె పొట్టేళ్ల అనుకూలంగా ఉంటాయి. పొట్టేళ్ల పెంపకాన్ని సాంద్ర పద్ధతిలో పోషిస్తే ప్రయోజనం ఎక్కువ విస్తృత పద్ధతిలో పోషిస్తే మేత కోసం ఎక్కువ దూరం నడవడం వల్ల శక్తిని కోల్పోతాయి. తక్కువ బరువు పెరగాలంటే బయట మేపకుండా రోజుకు 8 గంటలు పాకలోనే ఉంచి తగిన దాన పచ్చి మేతలు మేపాలి కొద్దిసేపు మాత్రమే పాక బయట తిరగాలి ప్రతి పొట్టేలకు పాక లోపల స్థలం కావాలి. బయట తిరగడానికి స్థలం ఉండాలి కంచి వేసిన పాకచుట్టు అవిశ ,శుభాలు విరిసిన కానుగ తదితర చెట్లు పెంచితే నీడతోపాటు పశుగ్రాసం కూడా లభ్యమవుతుంది 50 పిల్లలకు రెండు నుండి మూడు ఎకరాల భూమిని పశుగ్రాసాల సాగుకు కేటాయించాలి .పొట్టేలు పిల్లలను తీసుకువచ్చే రెండు నెలల ముందే బహు వార్షిక పశుగ్రాసాలైన పిల్లి పెసర అలసంద హనుమ తదితర వాటిని సాగు చేయాలి. తోటలలో పొట్టేలను పెంచేవారు పండ్ల తోటల్లో చెట్ల మధ్య అంతర పంటలుగా స్థాయిలో హెమేట అంజన్ గడ్డి తదితర పశుగ్రాసాలని సాగు చేస్తే పొట్టేళ్లకు పుష్టికరమైన పశుగ్రాసం లభిస్తుంది. తోటలోనే పొట్టేళ్లను మార్పిడి పద్ధతిలో మేపాలి ఈ విధంగా పెంచితే దాన అవసరం తగ్గి పొట్టేలు పెంపకం ఎక్కువ లాభదాయకంగా ఉంటుంది. పొట్టేలు పిల్లలకు ముందుగా ప్రతిరోజు నూరు గ్రాములు చొప్పున దానా అందిస్తూ క్రమైన దాణా పరిమాణాన్ని పెంచాలి నీటితో తడిచేసి ఇవ్వాలి పశుగ్రాస వృధా అరికట్టడంతో పాటు ఎక్కువ మేత సంగ్రహించేందుకు పశుగ్రాసాన్ని ముక్కలుగా కత్తిరించితే మంచిది ఇందుకుగాను గడ్డిని ముక్కలు చేసే చాప్టర్ యంత్రాన్ని కొనుగోలు చేయుట మంచిది. పొట్టేలు పిల్లలను కొనుగోలు చేసి తీసుకురాగానే నట్టల నివారణకు మందులు తాగించాలి. మూడు మాసాల వయసులో విత్తులు నొక్కేస్తే త్వరగా బరువు పెరుగుతాయి, ఫార్వర్డ్ రోగం మసూచి రోగం అంటే అంటువ్యాధులకు ముందుగానే వ్యాధి నిరోధక టీకా ఒకటి వేయించాలి. అత్యధిక బరువుతో మంచి జాతి లక్షణాలతో దృఢంగా బలిష్టంగా ఉన్న వాటిని ఎంపిక చేసి విత్తన పొట్టేలుగా పెంచి విక్రయించితే మరింత ఆదాయం పొందవచ్చును.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

**బద్వేల్ అర్బన్, మే 17 (ప్రభాతవార్త):**

ఇటీవల బద్వేల్ పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నూతనంగా పదవులు పొందిన పలువురు నాయకులను ఆదివారం సాయంత్రం మాజీ మునిసిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు ఎంఆర్ఎఫ్ టైర్స్ రమణారెడ్డి, గుర్రంపాటి కృష్ణారెడ్డి, జిల్లా రైతు విభాగ కార్యదర్శి పంగ చెన్నకృష్ణ రెడ్డి, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి బీ,వీ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. వాకమళ్ళ రంగారెడ్డి – జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, వేముల సుబ్బరాజ – జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు, గుంతపల్లి రామచంద్ర నాయుడు – జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, ఎద్దుల సుబ్బారెడ్డి – జిల్లా మున్సిపాలిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు, సానపరెడ్డి మురళీమోహన్ రెడ్డి – జిల్లా పంచాయతీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, చింతపల్లి శ్రీనివాసులు – జిల్లా ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శి మెంబర్, కొరిగం గురయ్యా – బద్వేల్ మున్సిపల్ బీసీ విభాగ ప్రధాన కార్యదర్శి మెంబర్, బొడ్డు పోయిన గోపాల్ – జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్, ప్రభవిటి భీముడు – జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్, గుర్రంపాటి తిరుపాలరెడ్డి – జిల్లా రైతు విభాగం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, నలదేశి రాజశేఖర్ – జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు, కూరకు సుధాకర్ – జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు, గాజులపల్లి రోసి రెడ్డి – బద్వేల్ మున్సిపాలిటీ విభాగ కార్యదర్శి, బండి చెన్నయ్య – జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పదాధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## కోసువారిపల్లె టీటీడీ పోటు వర్కర్ పై ఇంచార్జ్ మంత్రికి ఫిర్యాదు

### టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి

**తంబళ్లపల్లె మే 17 ప్రభాతవార్త ః**

మండలంలోని కోసువారిపల్లె లో వెలసిన టిటిడి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో పనిచేస్తున్న పోటు వర్కర్ మధుసూదన్ వ్యవహార శైలిపై జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో టీటీడీ ఉన్నతాధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినట్లు మండల టిడిపి అధ్యక్షుడు వి రెడ్డప్పరెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో పోటు వర్కర్‌గా చేరిన మధుసూదన్ ఆలయంలో భక్తుల పట్ల నోటి దురుసు, అమర్యాదగా మాట్లాడడం తోపాటు స్వామివారి నైవేద్యంలో శుద్ధి చేయని బియ్యం, ఉద్దిపప్పు వాడటం తో పాటు వండే సమయంలో మత్తు పదార్థం (హాన్స్) నోటిలో ఉంచుకొని స్వామి ప్రసాదం వండి అపవిత్రం చేస్తున్నాడని ఏమని అడిగితే కొందరు నాయకుల అండతో పైరవీలు చేస్తున్నట్లు విమర్శించాడు. దీంతోపాటు ఆలయంలోని బియ్యం, జీడిపప్పు, నెయ్యి, నూనె, అభిషేకానికి వాడే పూలు, పాలు, పెరుగు, నెయ్యి ఆలయంలోని కొందరి సహకారంతో రహస్యంగా అక్రమంగా తరలించినట్లు ఆరోపించారు. పోటు వర్కర్ చేస్తున్న అక్రమాలు సీసీ కెమెరాలు ఆఫ్ చేసి కొనసాగిస్తున్నట్లు తెలుసుకొని ఫిర్యాదులు చేశామని వీటిపై స్పందించి టిటిడి ఉన్నతాధికారులు విచారణకు హాజరవుతున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

## 20న ఆల్ ఇండియా కెమిస్టుల సమ్మెను జయప్రదం చెయ్యండి



**గాలివీడు, మే17, ప్రభాతవార్త.**

దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న ఆల్ ఇండియా కెమిస్టుల సమ్మెను జయప్రదం చెయ్యాలని గాలివీడులోని కెమిస్టులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేసి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ లో మందుల అమ్మకాలను నిషేధించాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అలాగే నకిలీ మందుల విక్రయాలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మె కారణంగా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా అవసరమైన మందులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలివీడు కెమిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం



**పీలేరు మే 17 ప్రభాతవార్త:**

అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా,పీలేరు వైద్య ఆరోగ్యశాఖ మరియు కోర్ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నుండి కొవ్వొత్తుల ర్యాలీ మానవహారం గాంధీరోడ్డు కూడలివరకు నిర్వహించారు. వారసత్వాన్ని వెలిగిద్దాం, నినాదంతో నిర్వహించే నేటి కార్యక్రమంలో, హెచ్ఐవి/ఎయిడ్స్‌తో మరనించిన వారి జ్ఞాపకాలను వెలిగించి, హెచ్ఐవితో జీవిస్తున్న వారికి జీవితం పై ఆశను అందించి, భావితరాలకు కళంకం లేని ఆరోగ్యకర సమాజాన్ని వారసత్వంగా ఇద్దామని పర్యవేక్షకులు చిన్నప్ప సమాజానికి ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు. హెచ్ఐవి ఎయిడ్స్ వల్ల కలిగే శారీరక మానసిక సామాజిక ఆర్థిక నష్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కంటే ఎయిడ్స్ బారిన పడకుండా తమకు తాము/ ఎవరికి వారు చక్కటి జీవనశైలితో జీవించే ఆవశ్యకతను ఐసిటిసి కౌన్సెలర్ రవి గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటి హెచ్ఇఓ కొండయ్య,పర్యవేక్షకులు చిన్నప్ప ప్రాజెక్టు మేనేజర్ హాసీనా,ఐసిటియస్ కౌన్సెలర్ రవి, ఏయన్ యం ద్రాక్షయని,లావణ్య ఆశా కార్యకర్తలు, తులసి,మోహన్ మురళి,బాలాజీ పాల్గొన్నారు.

## సోమేశ్వరాలయంలో చోరీ



**వాల్మీకిపురం మే 17 , ప్రభాతవార్త:**

మండలంలోని కొత్త మంచూరు సోమేశ్వరస్వామి వారి ఆలయంలో గుర్తుతెలియని దుండగలు ఆదివారం తెల్లవారి జామున చోరీకి చొరబడినట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం గ్రామస్థులు గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం ఇదే ఆలయంలో గుర్తు తెలియని దుండగలు చోరికి చొరబడి ఇదే సమయంలో అక్కడున్న పూజారి సీతారామయ్యను హతమార్చి దొంగతనానికి పాల్పడ్డారు. తాజాగా ఈ పురాతన సోమేశ్వరస్వామి వారి ఆలయంలోని అమ్మవారి బంగారు మంగళసూత్రంతో పాటు హుండీలోని నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. హుండీలో దాదాపు రూ.20 వేల నుంచి రూ.25 వేల నగదు ఉంటుందని అంచనా, ఆయలంలోని బీరువా తలుపులు సైతం పగొలగొట్టి అందులోని వస్తువులను చిందర బందరగా పడేశారు. ఈ ఆలయంలో వరుస చోరీలతో మంచూరు గ్రామస్థులు హడలి పోతున్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**బద్వేల్ మే 17. ప్రభాతవార్త**

బద్వేల్ పట్టణంలో ని మైదుకూరు రోడ్డు పోలేరమ్మ గుడి ఎదురుగా డాక్టర్ దాసరి శ్రీ ను హాస్పిటల్ లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది ఉచితంగా బీపీ షుగర్ ఎముకల సాంద్రత పరీక్ష లుఉచితంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ధరణి ఇంద్రనీర మని ఎంబిబిఎస్ ఎండి ప్రత్యేకించి స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు కీళ్ల నొప్పు లు అరికాల మంటలు పక్షవాతం ఆయాసం తిమ్మిర్లు అన్ని రకాల నొప్పులు అన్ని రకాల చర్మ వ్యాధులు ప్రత్యేకించి స్త్రీలకు సంబంధించిన వ్యాధులు పరీక్ష లు చేసి వైద్యం అందించారు డాక్టర్ దాసరి భరణి హంసిని పక్షవాతం సం బంధించిన రోగులకు ప్రత్యేకించి నొప్పులకు అన్ని రకాల యాక్సిడెంట్ కేసులు సంబంధించిన ఫిజియోథెరపీ కార్యక్రమాలు చేపట్టారు ఈ హాస్పిటల్ నిర్వహ ణను డాక్టర్ దాసరి శ్రీనివాసులు, సిబ్బంది అందరూ సేవలు అందించారు.





# ఇరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం





**సిద్ధవటం, మే 17 ప్రభాతవార్త**

ఇరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ అన్న ప్రసాదాలు స్వీకరించారు మండలంలో ని మూలపల్లి క్రాస్ వద్ద వెలసిన శ్రీ ఇరుగులమ్మ తల్లి అమ్మవారు తిరుణాల మహోత్సవం సంద ర్భంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజాభిషేక కార్యక్ర మాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ పూజారి రమణయ్య మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన అభిషేకాలు వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించామని మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని బోనాలు సమర్పించారని కడప నగరానికి చెందిన ఇరగయ్య కుటుంబీకులు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారన్నారు.

## ఎయిడ్స్ బాధితులకు కొవ్వొత్తులతో ర్యాలీ



**ముద్దనూరు, మే 17 , ప్రభాతవార్త:**

పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్ స్టాండ్ కూడలి వరకు అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఆదివారం ప్ర త్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ కారణంగా మరణించిన వారి ఆ త్మలకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ కరిష్మా మాట్లాడుతూ హెచ్ఐవీ/ ఎయిడ్స్ పై సమాజంలో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నా రు. ఎయిడ్స్ బాధితులను వివక్షకు గురి చేయకుండా వారికి మానవత్వంతో సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వ్యాధి నియంత్రణకు జాగ్రత్తలు, ప రీక్షలు మరియు సమయానికి చికిత్స ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతిజ్ఞ చేయిం చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్ని స్మరించు కున్నారు.

# భార్య జీవనం విలాసవంతం కాకపోయినా పేదరికంలో మగ్గకుండా చూడటం కోర్టు బాధ్యత

**(పాట్నా హైకోర్టు తీర్పు )**

**బద్వేలు లీగల్, మే 17 ప్రభాతవార్త:**

భార్య జీవనం విలాసవంతంగా ఉండనవసరంలేదు అలాగని ఆమెను అరా కొరా జీవితానికి వదిలివేయకూడదని అభిప్రాయపడిన పాట్నా హైకోర్టు మర్చం ట్ నేవీ అధికారి మరియు ఇతని భార్య 15 ఏళ్ళ వివాహాన్ని రద్దు చేసింది. భర్త 90 లక్షలు రూపాయలు శాశ్వత భరణంగా చెల్లించాలని ఆదేశించింది. భార్య పేదరికంలో మగ్గకుండా గౌరవంగా మరియు సౌకర్యంగా జీవించేలా చూడటం కోర్టు విధి అని ఛీఫ్ జస్టిస్ పి.బి. భజంత్రీ మరియు జస్టిస్ ఎస్. బి.పి.డి. సింగ్ లతో కూడిన ధర్మాసనం పేర్కొనింది. ఈ వ్యాఖ్యలతో హిం దూ వివాహ చట్టం–1955 సెక్షన్–13(1)(ఐ–ఎ) క్రింద భర్త విడాకుల పిటీషన్ ను గతంలో కొట్టివేసిన ముజఫర్పూర్ ఫ్యామిలీ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి తీర్పును కోర్టు ప్రక్కన పెట్టింది. క్లుప్తంగా వివరాల్లోకి వెళితే ఈ జంట 2010 డిశంబ రులో వివాహం చేసుకున్నారు. కానీ ఆ తరువాత వారి సంబంధం త్వరలోనే చెదిరిపోయింది. భర్త చెప్పిన ప్రకారం అతని భార్య ప్రవర్తన మొదటి నుండీ శత్రుత్వంతో కూడుకుని ఉన్నది. పెళ్ళయిన రెండు నెలల్లోనే ఆమె ఇళ్ళు విడిచి వెళ్ళిందని, పదే పదే అభ్యర్థించినప్పటికీ తిరిగి రాలేదని పేర్కొన్నాడు. అం దువల్ల వైవాహిక సంబంధం ఇప్పటికే సరి చేయలేనంతగా వీగిపోయిందని దాంపత్య జీవితాన్ని పునరుద్ధరించే ఆశ లేదని అతను వాదించాడు. మరోవైపు భర్త లేనప్పుడు తన అత్త మామలచే "అత్యంత దారుణమైన క్రూరత్వానికి" గురయ్యానని, చివరికి 2011 డిశంబరులో ఇంటినుండి వెళ్ళగొట్టారని భార్య ఆరోపించింది. నా తండ్రిని వరకట్నం డిమాండ్లను తీర్చుమని బలవంతం చేశా రని అత్తమామల డిమాండ్లు తీర్చేందుకు తన పేరుమీద బుక్ చేసుకున్న ఫ్లాట్ ను కూడా అమ్మేశాడని ఆమె ఆరోపించింది. ప్రస్తుతం ఓడ కెప్టెన్ గా వున్న తన భర్త తనను సరిగా చూసుకోలేదని వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని తనతో వివాహబంధం కొనసాగించడానికి ఇష్టపడటం లేదని కూడా ఆమె ఆ రోపించింది. తన భర్త ఆదాయం సంవత్సరానికి దాదాపు కోటి రూపాయలు వుంటుందని అయితే తనకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడానికి అతను ఆసక్తి చూ పడం లేదని తాను వృద్ధ తల్లిదండ్రులపై ఆధారపడి వున్నానని పేర్కొనింది. కేసు యొక్క వాస్తవాలు మరియు పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుని ఫ్యా మిలీ కోర్టు 2018లో విడాకుల కొరకు అప్పీలుదారైన భర్త చేసిన అభ్యర్థనను తిరస్కరిస్తూ ఆమె క్రూరత్వం చూపినట్లు, వదిలిపెట్టి వెళ్ళినట్లు రుజువు చేయలేకపోయాడని పేర్కొనింది. దాంతో భర్త హైకోర్టును ఆశ్రయించగా నెలకు 10 వేలు రూపాయలు భార్యకు భరణంగా చెల్లించేందుకు అంగీకరించాడు. కేసు పెండింగులో ఉన్న సమయంలో భర్త తన భార్యకు 50 లక్షలు రూపా యలు శాశ్వత భరణంగా ఇస్తానని ప్రతిపాదించాడు. అయితే ఆమె దానిని తి రస్కరించింది. పరస్పర విడాకుల అంగీకారానికి ఆమె 90 లక్షలు రూపాయలు మరియు నివాస వసతిని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో వివాహం తిరిగి పొందలేని విధంగా విచ్ఛిన్నమైనదిని వివాహ సంబంధాన్ని కొనసాగించుమని వారిని బలవంతం చేయడం చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవు తుందని కోర్టు పేర్కొంటూ వారి వివాహాన్ని రద్దు చేసింది. అయితే శాశ్వత భరణం విషయంలో రెండు పార్టీల ఆదాయం మరియు ఆస్తి వారి ప్రవర్తన మరియు ఇతర సంబంధిత పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుని భరణం మంజూరు చేయడానికి కోర్టుకు అధికారం ఇచ్చే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్–25 ను ధర్మాసనం ప్రస్తావించింది. రజనేష్ ఎదిరి నేహా, కిరణ్ జ్యోత్ మైని ఎదిరి అనీష్ ప్రమోద్ పటేల్ మరియు ప్రవీణ్ కుమార్ జైన్ ఎదిరి అం జూ జైన్కు సంబంధించిన కేసులల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఉటం కిస్తూ శాశ్వత భరణాన్ని నిర్ణయించడానికి "స్థిరమైన సూత్రం" లేదని హైకోర్టు పునరుద్ఘాటించింది. భరణం పరిమాణం ఉభయ పార్టీల ఆదాయం వివాహ సమయంలో ప్రవర్తన, సామాజిక మరియు ఆర్థిక స్థితి వైవాహిక, ఇంట్లో భార్య అనుభవించే జీవన ప్రమాణం మరియు భర్త ఆర్థిక సామర్థ్యంపై ఆధార పడి వుండాలని అది పేర్కొంది. వివాహ వ్యవధి కూడా భరణాన్ని నిర్ణయిం చడంలో కీలకంగా ఉంటుందని కోర్టు నొక్కి వక్కాణించింది. సాధారణంగా 10 సంవత్సరముల కంటే ఎక్కువ కాలం కొనసాగే వివాహాలకు జీవితకాల భరణం మంజూరు చేయడానికి అర్హత వుంటుందనికూడా పేర్కొనింది. ఇంకా పరిమా ణాన్ని నిర్ణయించేటప్పుడు భర్త మర్చంట్ నేవీలో మాస్టర్గా నెలకు రు.5,6 లక్షలు ఆదాయం పొందుతూ వుండడం, పైగా పూర్వీకుల ఆస్తులు కలిగి వుం డటాన్ని ధర్మాసనం పరిగణనలోనికి తీసుకొనడమే కాక మరోవైపు భార్యకు స్వ తంత్ర ఆదాయ వనరులు లేవని కుటుంబ కోర్టు ఇచ్చిన మునుపటి ఉత్తర్వుల ప్రకారం నెలకు 10 వేలు భరణంగా పొందుతూ తన వృద్ధ తల్లిదండ్రులపై ఆధారపడి ఉందని ధర్మాసనం పేర్కొంటూనే "భార్య పేదరికంలో కాకుండా గౌరవంగా మరియు సౌకర్యంగా జీవించేలా చూడటం కోర్టు యొక్క విధి. జీవించడం విలాసవంతంగా వుండనవసరం లేదు. కానీ అదే సమయంలో ఆ మెను అసౌకర్యంగా జీవించడానికి వదిలివేయకూడదు. భార్య ఏలాంటి మాన వ కల్పిత దురదృష్టం పాలు కాకుండా చూసేందుకు కోర్టు సమస్య పట్ల ఆచర ణాత్మక సున్నితత్వంతో వ్యవహరించాలి". అని కూడా ధర్మాసనం వ్యాఖ్యానిం చింది ఈ విధంగా యావత్తు పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుని భర్త 6 నెలల లోపు భార్యకు 90 లక్షలు రూపాయలును శాశ్వత భరణంగా చెల్లిం చాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. ఒకవేళ చెల్లించకపోతే ఆ మొత్తంపై సంవత్సరమునకు 6 శాతం చొప్పున సాధారణ వడ్డీ వేయాల్సి ఉంటుందని కూడా స్పష్టం చేసింది. విడాకుల డిక్రీని ఆమోదించిన తరువాత కోర్టు అధికార పరిధి ముగుస్తుంది. కాబట్టి హిందూ వివాహ చట్టంలోని సెక్షన్–25 ప్రకారం శాశ్వత భరణాన్ని మరింత పెంచుమని కోరుతూ భార్య స్వతంత్ర దరఖాస్తును దాఖలు చేసుకునే స్వేచ్ఛ ఉందని కూడా ధర్మాసనం తన ఉత్తర్వులలో సుస్పష్టం చేస్తూ తే.14.10.2025 దీన ఈ తీర్పును వెలువరించింది. ( శీర్షిక: ఎం.ఎ.996/2018, పాట్నా హైకోర్టు)

## అమ్మవారి దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ



**సిద్ధవటం, మే 17 ప్రభాతవార్త**

శ్రీ జగజ్జనని రేణుక ఎల్లమాంబ అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ పుత్ర నరసిం హారెడ్డి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ జగజ్జీని రేణుక ఎల్లమాంబ అమ్మవారిని మాజీ ఎమ్మె ల్సీ టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి పుత్త నరసింహారెడ్డి దర్శించుకున్నారు ఆయ నకు ఆలయ సంప్రదాయాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పుత్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడి రైతు పంటలు దిగుబడి చెందాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందంటూ తెలిపారు కూటమి ప్రభుత్వానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని రాబోయే స్థానిక ఎలక్షన్లో కూట మి ప్రభుత్వం అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని తెలిపారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ నిరసన

**పులివెందుల, మే 17, ప్రభాత వార్త :**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పులివెందులలో నిరసన కార్యక్రమం నిర్వ హించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికలకు ముందు తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని తమ ఎ న్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోల్, డీజిల్ విక్రయిస్తు న్నారని వారు ఆరోపించారు. తా జాగా మరింతగా ధరలు పెంచడం వల్ల సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతోందని, ముఖ్యంగా రైతాంగం మరియు రవాణా రంగంపై తీవ్ర ప్రభా వం చూపుతోందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యం లో మే 18న ఉదయం 9 గంటలకు పులివెందుల ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేయ నున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని పార్టీ నా యకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

### సొంత ఊరి ప్రజలకు

# ఉచితంగా సేవలు అందించేందుకే వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎస్పి మనోజ్, డాక్టర్ మారుతి కృష్ణ



వైద్యం కోసం ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

**రాజంపేట, మే 17 ప్రభాతవార్త**

సొంత ఊరిలో ఉంటున్న ప్రజలకు ఉచితంగా మంచి వైద్య సేవలు అం దించేందుకే ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తిరుపతి మారుతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మాలేపాటి మారుతి కృష్ణ పేర్కొన్నారు. ఆదివా రం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా సూపర్ స్పెషా లిటీ మెగా వైద్య శిబిరంను రాజంపేట ఎస్పి మనోజ్ రామనాథ హెగ్డే తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. గుం డెకు సంబంధించిన వైద్యులు ఊపిరితిత్తుల నిపుణులు, ఎముకల డాక్టర్లతో పాటు వివిధ విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్సలు నిర్వహించారు. బిపి షుగర్ , ఈసీజీ 2డి ఎకో, మరియు ఎముకల బలాన్ని సూచించే పరికరాలతో పాటు పల్మనాలజీకి చెందిన అత్యాధునిక యం త్రాలతో రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి హాస్పిటల్ యజమాని డాక్టర్ మారుతి కృష్ణ మాట్లాడుతూ సొంత ఊరికి ఇక్క డున్న ప్రజలకు ఏదో విధంగా సేవ చేయాలన్న ఉద్దేశంతో తాను ఈ మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. వివిధ అత్యాధునిక వైద్య పరికరాలతో శిబిరాన్ని నిర్వహించడం ఇదే ప్రథమమని ఆయన పేర్కొ న్నారు. భవిష్యత్తులో మారుతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు ప్రజలు ఈ సద వకాశాన్ని వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్ర మంలో మాలేపాటి రామకృష్ణ నాయుడు, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర వైద్యులతోపాటు భాస్కర్, మారుతి వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా నివాళులు

**బద్వేలు అర్బన్, మే 17, ప్రభాతవార్త**

అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా బద్వే ల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రత్యేక కార్యక్ర మం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ కారణంగా మృతి చెందిన వారికి కొవ్వొత్తు లు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అ వగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని ప్రజలకు హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ బాధితు లను వివక్షకు గురి చేయకుండా మానవత్వంతో ఆదుకోవాలని, సమయానికి పరీక్షలు, చికిత్సలు తీసుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని తెలి పారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి. మురళీకృష్ణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య , హెల్త్ సూపర్వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసులు, క్లస్టర్ లింక్ వర్కర్ కవిత, ఆర్కేఎస్కే భారతి, పీర్ ఎడ్యుకేటర్ వన్నూరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## కేవీ సుబ్బారావుకు ఘన సన్మానం

**బద్వేల్ అర్బన్, మే 17 ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర డైరెక్టర్గా ఇటీవల నియమితులైన బాలాజీ సంస్థల అధినేత, మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కేవీ సు బ్బారావుకు ఘన సన్మానం జరిగింది. సిద్దవరం రోడ్డులోని శ్రీ మహాలక్ష్మి గోదా దేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ ఆధ్వర్యంలో సుబ్బారావు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఇదే కార్యక్రమం లో ఇటీవల మార్కెట్ యార్డ్ డైరెక్టర్గా నియమితులైన కొలిశెట్టి నాగరాజాను కూడా శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సం దర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ నూతన డైరెక్టర్లు ఇరువురూ భవి ష్యత్తులో ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో వీరు రాష్ట్ర స్థాయిలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని, భగవంతుడు వీరికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సముద్రాల పుల్ల య్య ఉరిమి సుబ్బారావు పబ్బతి చక్రపాణి సతీష్ చిందుకూరి ప్రసాద్ పలు వురు ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



## టిడిపి జాతీయ అధ్యక్షులు హరి ప్రసాద్‌ను కలిసిన మార్కెట్ యార్డ్ చైర్మన్

**బద్వేల్ మే 17 (ప్రభాతవార్త):**

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బి. హరిప్రసాద్‌ను బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ, బీజేపీ పోరుమామిళ్ల మం డల అధ్యక్షుడు నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. సుప్రజ స్వగృ హంలో జరిగిన ఈ సమావేశంలో హరిప్రసాద్ ఆమెకు ప్రత్యేక అభినం దనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కష్టపడి పనిచేయాలని ఆకాంక్షిస్తూ ఆమెను ఆశీర్వదించారు. స్థానిక రాజకీయాల్లో సేవాభావంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, లకిడి విజయ్, నాగార్జున, నాగరాజు తదితరులు పా ల్గొన్నారు.




వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

ఖాజీపేట, వల్లూరు, చెన్నూరు, కడప కలెక్టరేట్

ఇంటర్వ్యూ తేది : 18.05.2026

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086



30 YEARS ANNIVERSARY

'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించి రెండు తెలుగు రాష్ట్రాల్లో చెరగని ముద్ర వేసుకున్న జాతీయ దినపత్రిక వార్తకు వార్షికోత్సవ శుభాకాంక్షలు

బి.శ్రీవర్ధిని మరియు బి.శ్రీశశాంక్

సిద్ధవటం, కడప జిల్లా.



'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

SAIBABA HIGH SCHOOL

SAIBABA NAGAR, AKKAYAPALLI, KADAPA.

Nurturing Holistic Development | CBSE Curriculum Embracing Activity Learning, Life Skills and Holistic Teaching | ELITE | PAVING THE WAY TO SUCCESS IN IIT & NEET Examinations

From 3rd - 10th Good Hostel Facilities for both Girls & Boys | A/c. Class Rooms | Brilliance

సెల్: 9154944970, 9154944955

యం.వి.రామచంద్రారెడ్డి, ఛైర్మన్, సాయిబాబా విద్యాసంస్థలు, అక్కాయపల్లి, కడప జిల్లా.



'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

'వార్త' జాతీయ దినపత్రిక వార్షికోత్సవ శుభ సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, పత్రికా విలేకర్లకు మా హార్థిక శుభాకాంక్షలు

30 YEARS ANNIVERSARY

జి.దిపేష్ కుమార్, జి.దన్వీ కృష్ణ, కడప



'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

30 YEARS ANNIVERSARY

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించి రెండు తెలుగు రాష్ట్రాలలో చెరగని ముద్ర వేసుకున్న జాతీయ దినపత్రిక వార్తకు వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి శుభాకాంక్షలు...

పి.వెంకట శ్రీచరణ్‌రెడ్డి, B.Tech.,

పి.చక్రధర్ రెడ్డి, B.Tech.,



'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

30 YEARS ANNIVERSARY

ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించి రెండు తెలుగు రాష్ట్రాల్లో చెరగని ముద్ర వేసుకున్న జాతీయ దినపత్రిక వార్తకు వార్షికోత్సవ శుభాకాంక్షలు

నగరపాలక సంస్థ

కడప, వైఎస్ఆర్ కడప జిల్లా.